నమస్తే తెలంగాణ
సిద్దిపేట
I | హైదరాబాద్, గురువారం 25 ఏప్రిల్ 2024 | SIDDIPET

సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం నాగపురిలో బొడ్రాయి ప్రతిష్ఠలో భాగంగా పూజలు చేస్తున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కేసీఆర్ పాలనలో దేవాలయాలకు మహర్దశ

- జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, ఏప్రిల్ 24: తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పదేండ్ల పాలనలో దేవాలయాలకు మహర్దశ పట్టిందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండలంలోని నాగపురిలో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఆధ్యాత్మిక కార్యక్రమాలకు పెద్దపీట వేసిందన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదాద్రి నిర్మాణం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. గ్రామదేవతల దీవెనలతో సకాలంలో వర్షాలు కురిసి రాష్ట్ర ప్రజలు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బీఆర్ఎస్ రోడ్ షో

- మెదక్‌లో రెండుసెట్ల నామినేషన్లు దాఖలు చేయనున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- పాల్గొననున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు
- రోడ్ షో విజయవంతం చేయాలని పిలుపునిచ్చిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

మెదక్, ఏప్రిల్ 24 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లా కేంద్రంలో గురువారం భారీ ఎత్తున రోడ్డు షో నిర్వహించేందుకు బీఆర్ఎస్ అన్ని ఏర్పాట్లు చేసింది. ఉదయం 10 గంటలకు ధ్యాన్‌చంద్ చౌరస్తా నుంచి రాందాస్ చౌరస్తా వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మెదక్ పార్లమెంట్ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు, బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొనన్నారు. పెద్దసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని రోడ్‌షోను విజయవంతం చేయాలని మాజీ మంత్రి హరీశ్‌రావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు కంచుకోట అయిన మెదక్‌లో మరోసారి గులాబీ జెండాఎగరడం ఖాయమన్నారు. మెదక్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డిని గెలిపించి బీఆర్ఎస్ సత్తా చాటాలన్నారు. ప్రభుత్వ అధికారిగా విశిష్ట సేవలందించిన వెంకట్రామిరెడ్డిని గెలిపించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. వేసవి నేపథ్యంలో కార్యకర్తలు, అభిమానులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూడాలని ఆయన నాయకులకు సూచించారు.

జహీరాబాద్ మండలం దిడిగిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదు

- ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు
- జహీరాబాద్ మండలంలో గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం

కోహీర్, ఏప్రిల్ 24: అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని హుగ్గెల్లి, రాయిపల్లి, దిడిగి, కొత్తూర్(బి) గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. రైతుబంధు, ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని అడిగితే చెప్పులతో కొడతాం అంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తొక్కుతం, పేగులు మెడలో వేసుకొంటాం అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హామీల అమలు, మంచి పనులు చేసేందుకు అధికారంలోకి వచ్చారా.. లేకా తిట్ల కోసం వచ్చారా? అని ప్రశ్నించారు. ఒక ముఖ్యమంత్రి వాడాల్సిన భాష ఇదేనా అని నిలదీశారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు మంజూరైనా ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు అక్రమ కేసులు పెడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా కల్పించారు. 2001 నుంచి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గాలి అనిల్‌కుమార్‌ను గెలిపిస్తే పార్లమెంట్‌లో జహీరాబాద్ సమస్యలను లేవనెత్తుతారన్నారు. గతంలో కేసీఆర్ చేసిన అభివృద్ధి పనులు, ఇప్పుడు కాంగ్రెస్ చేస్తున్న పనుల్లో తేడాను చూసి ఓటువేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నర్సింహులు, గుండప్ప, పెంటారెడ్డి, మచ్చేందర్, రాములు, జలీల్, విజయ్, కరుణ్‌రాజ్, వీరన్న, రమేశ్‌రెడ్డి, సరస్వతి, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాలను కాంగ్రెస్ మోసం చేసింది

మెదక్ జిల్లా చేగుంటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్

- మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్

చేగుంట, ఏప్రిల్ 24: అసెంబ్లీ ఎన్నికల్లో మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్ అన్నారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి తరపున మెదక్‌లో నామినేషన్ వేసి చేగుంటకు వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గెలిచిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ చెప్పి నాలుగు నెలలు గడుస్తున్నా 'ఎక్కడ వేసిన గొంగడి అక్కడే' అన్న చందంగా ఉందన్నారు. ఆగస్టు 15 వరకు రూ. 2లక్షల రుణ మాఫీ చేస్తానని, ఐదువందల బోనస్ ఇస్తానని సీఎం రేవంత్ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరిగిందన్నారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి పేదల సంక్షేమంపై అవగాహన ఉందని,ఎంపీ అయితే అనేక సేవా కార్యక్రమాలు చేస్తారనే నమ్మకంతో కేసీఆర్ టికెట్ కేటాయించారన్నారు. తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యమవుతుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మైనార్టీ మండల నాయకుడు మహ్మద్‌అలీ, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు రబ్బాని, రహీమొద్దీన్, వల్లూర్ గ్రామ కమిటీ అధ్యక్షుడు వాహిద్, వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మీర్ గియాస్‌వుద్దీన్, షాదుల్లా పాల్గొన్నారు.



మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీలతో కలిసి ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న జహీరాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్

సంగారెడ్డి, పటాన్‌చెరు ఎమ్మెల్యేలు ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్‌తో కలిసి నామినేషన్ వేస్తున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

పటాన్‌చెరు, నర్సాపూర్ ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డి, మెదక్ జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, బట్టి జగపతితో కలిసి నామినేషన్ వేస్తున్న మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

నేటితో నామినేషన్లకు తెర

సంగారెడ్డిలో 11, మెదక్‌లో 12 నామినేషన్లు దాఖలు

మెదక్, (నమస్తే తెలంగాణ)/సంగారెడ్డి కలెక్టరేట్: ఏప్రిల్ 24: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం అత్యధికంగా 11 నామినేషన్లు దాఖలయ్యాయి. జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ స్థానానికి ఆరో రోజు 10 మంది అభ్యర్థులు 11 నామినేషన్లు వేయగా, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ తన నామినేషన్‌ను దాఖలు చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ జైపాల్‌రెడ్డితో కలిసి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అభ్యర్థిగా సురేశ్‌కుమార్ షెట్కార్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి దేవ సిఖామణి, రాష్ట్ర సామాన్య ప్రజాపార్టీ నుంచి ఎండీ మున్వర్ హుస్సేన్, బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థి బాల్‌రాజు బట్టెంకి, స్వతంత్ర అభ్యర్థులు తలారి అశోక్, జైపాల్ నాయక్ జడావత్, రమేశ్ సజ్జాపూర్, ఎండీ యాకూబ్ షరీఫ్, గొల్లపల్లి మాణయ్య ఒక్కో సెట్ నామినేషన్ దాఖలు చేశారు.ఆయా నామినేషన్లను రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి స్వీకరించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతి మాట్లాడుతూ పోటీ చేస్తున్న అభ్యర్థులకు సంబంధించిన ఆస్తులు, అప్పులు, నేర చరిత్ర వివరాలను ఎప్పటికపుడు సంగారెడ్డి రిటర్నింగ్ అధికారి నోటీసు బోర్డుపై ఉంచడంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. పూర్తి వివరాల కోసం affidavit.eci.gov.in ప్రత్యేక వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. గురువారంతో నామినేషన్ల ప్రక్రియకు తెరపడనున్నది.

మెదక్‌లో 12 నామినేషన్లు దాఖలు

మెదక్ పార్లమెంట్ ఎన్నికల 2024 నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. ఇందులో బీఆర్ఎస్ నుంచి ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామిరెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను సంగారెడ్డి, పటాన్‌చెరు, నర్సాపూర్ ఎమ్మెల్యేలు చింతాప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, సునీతారెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్‌తో కలిసి అందజేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మాజీ ఎమ్మెల్యేలు హన్మంతరావు, మదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌తో కలిసి రెండో సెట్ నామినేషన్ వేయగా, విముక్తి చిరుతల కక్షి పార్టీ నుంచి ఎల్లయ్య, యుగ తులసి పార్టీ నుంచి అనిల్‌మొగిలి, ఇండిపెండెంట్ అభ్యర్థులుగా లక్ష్మీనారాయణ, నవీన్, రమేశ్, జి.ప్రదీప్‌కుమార్, ఆంజనేయులు, ధర్మారం నరహరి, దాసరి భానుచందర్ నామినేషన్లు వేశారు.

జీవితాంతం ప్రజా సేవలో ఉంటా

- మెదక్ గడ్డపై బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తాం
- కలెక్టర్‌గా ఇక్కడే పనిచేశా.. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా
- ట్రస్టు ఏర్పాటు చేసి పేద పిల్లలకు విద్య అందిస్తా
- బీజేపీ, కాంగ్రెస్ దొందూ దొందే!
- మెదక్‌లో నామినేషన్ వేసిన తర్వాత ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

మెదక్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

మెదక్, ఏప్రిల్ 24(నమస్తే తెలంగాణ): 'జీవితాంతం ప్రజా సేవలో ఉంటా.. మీ అందరూ ఆదరించాలని కోరుకుంటున్నా. ట్రస్టు ఏర్పాటు చేసి పేద పిల్లలకు విద్య అందిస్తా' అని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, పటాన్‌చెరువు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జడ్పీ చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఫరూక్‌హుస్సేన్, బట్టి జగపతితో కలిసి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఆయన దాఖలు చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఆర్ఎస్ తరపున మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో రెండు సెట్ల నామినేషన్ వేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ తప్పుడు హామీలు ఇచ్చిందని, ఇంటింటికీ బాండ్ పేపర్ ఇచ్చి అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రజలను దగా చేసి మోసం చేసి దొంగఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిందన్నారు. నాలుగు నెలల్లో కాంగ్రెస్ అసలు రంగు బయటకు వచ్చిందన్నారు. కాంగ్రెస్ రైతులను దుఃఖసాగరంలో నింపిందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు దుబ్బాక ప్రజలను మోసం చేశాడన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో స్వర్గీయ రామలింగారెడ్డి చనిపోయిన తర్వాత ఉప ఎన్నికల్లో అమలు కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాడని చెప్పారు. దుబ్బాక ప్రజలకు నాగలి, ఎద్దులు, నిరుద్యోగులకు రెండు వేలు ఇస్తానని మోసం చేశాడన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రఘునందన్‌రావును 54వేల ఓట్లతో అక్కడి ప్రజలు ఓడించారని గుర్తుచేశారు. దుబ్బాకలో చెల్లని రూపాయి మెదక్ పార్లమెంట్‌లో ఏ విధంగా చెల్లుతుందని ఆరోపించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో నేను ముందుకు వచ్చానని,ప్రధాన పార్టీ అభ్యర్థులు, వారి అర్హతలను చూసి ఓటు వేయాలని కోరారు. నిరుపేద కుటుంబాల కోసం సొంతంగా ట్రస్టు ఏర్పాటు చేస్తున్నానని, గెలిచిన తొమ్మిది నెలల్లోపు ప్రతి నియోజకవర్గంలో ఫంక్షన్‌హాల్ నిర్మించి ప్రతి పేద కుటుంబానికి ఒక్క రూపాయితో శుభకార్యాలయాలు చేసుకునే సదుపాయం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రజల ఆదరణతో ఘనవిజయం సాధిస్తాననే నమ్మకం ఉందన్నారు. 11 ఏండ్లు ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా పనిచేసిన అపార అనుభవం ఉందన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరు ఉన్నారు, వారి గుణగణాలు ఏమిటో చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. గురువారం మాజీ మంత్రి, సిద్దిపేట హరీశ్‌రావు, పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి అశేష జనవాహినితో రెండు సెట్ల నామినేషన్లు వేయనున్నట్లు ఆయన తెలిపారు.



సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో నామినేషన్ పత్రాలకు పూజ చేస్తున్న అర్చకులు, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సేవకుడిగా వస్తున్నా..ఆశీర్వదించాలి

- మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి
- సిద్దిపేట జిల్లాలోని కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి పూజలు

నంగునూరు, ఏప్రిల్ 24: 'ప్రజా సేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చా.. కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్నా.. గెలిచిన నెల రోజుల్లో 100 కోట్లతో ట్రస్టు ఏర్పాటు చేస్తా' అని మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం బీఆర్ఎస్‌కు సెంటిమెంట్ ఆలయం అయిన సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని కోనాయిపల్లి వేంకటేశ్వరాలయంలో స్వామి వద్ద నామినేషన్ పత్రాలపై సంతకాలు చేసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుతో పాటు మెదక్ పార్లమెంట్ ప్రజల ఆశీస్సులతో ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని చెప్పారు. కలెక్టర్‌గా ఖ్యాతి ఇచ్చిన ఈ గడ్డ రాజకీయ జీవితం ఇవ్వాలని కోరారు. మాట తప్పే మనిషిని కాదని, స్వామివారి సాక్షిగా ట్రస్టు ఏర్పాటు చేసి యువతీ యువకులకు అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, జడ్పీటీసీ ఉమావెంకట్‌రెడ్డి, నాయకులు జాప శ్రీకాంత్‌రెడ్డి, దువ్వల మల్లయ్య, మారెడ్డి రవీందర్‌రెడ్డి, సంగు పురేందర్, రాగుల సారయ్య, నిమ్మ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

- ఉద్యోగానుభవంతో పుస్తకం రాసిన రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి
- పుస్తకావిష్కరణ చేసిన దువ్వూరి సుబ్బారావు
- గీతంలో కౌటిల్యా విద్యార్థులతో ముఖాముఖి



గీతంలో రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు రచయితగా రాసిన జస్ట్ ఏ మెర్సెనరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్ పుస్తకావిష్కరణ చేస్తున్న దృశ్యం

పటాన్‌చెరు, ఏప్రిల్ 24: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో రిజర్వ్ బ్యాంకు మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తన ఉద్యోగానుభవాలతో రాసిన పుస్తకాన్ని కౌటిల్యా విద్యార్థుల సమక్షంలో ఆవిష్కరించారు. బుధవారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారంలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీలో డాక్టర్ దువ్వూరి సుబ్బారావు జస్ట్ ఏ మెర్సెనరీ.? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్ పేరుతో ప్రచురించిన ఆంగ్ల పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. కౌటిల్యాలో విశిష్ట విజిటింగ్ ప్రొఫెసర్ అయిన సుబ్బారావు 2008 నుంచి 2013 వరకు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు గవర్నర్‌గా పనిచేశారు. అంతకు ముందు భారత ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శిగా, ప్రధానమంత్రి ఆర్థిక సలహాదారుడిగా అత్యున్నతమైన ఉద్యోగాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు తన కెరీర్‌కు సంబంధించిన ఆకర్షణీయమైన, శ్రద్ధాసక్తులతో కూడిన కథనాన్ని అందించడమే కాకుండా, యువ నిపుణులకు వారి సొంత వృత్తిలో రాణించడానికి మార్గదర్శనం చేసేలా, యువతను ప్రేరేపించేలా రాసినట్లు వివరించారు. చిన్నప్పటి నుంచే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. వివిధ శాఖల్లో పలు హోదాల్లో పనిచేసిన అనుభవం నుంచి రాసిన పుస్తకాలు రేపటి తరానికి ఉపయోగపడుతాయని తెలియజేశారు. జిల్లా స్థాయి నియామకాల నుంచి భారతదేశ బ్యూరోక్రాటిక్ ఫ్రేమ్‌వర్క్ వరకు జరిగిన పరిణామక్రమం, పౌరసేవల్లో లింగసమానత్వం వంటి పలు ఆసక్తికర అంశాలను స్పృశించినట్లు తెలిపారు. విద్యార్థులు భవిష్యత్‌లో రాణించేందుకు ఆయన పలు సలహాలు అందజేశారు. గత యాభై ఏండ్లలో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. అనేక రంగాల్లో దేశం ముందుకు పయనించిందన్నారు. ఆధునిక సాంకేతిక విజ్ఞానం రావడంతో అధికారులు నిర్ణయాలు తీసుకోవడంలో వేగం వచ్చిందన్నారు. బ్యూరోక్రాట్స్‌గా కేవలం వీడియోకాలింగ్స్, సమావేశాలతోనే విషయ పరిజ్ఞానం రాదన్నారు. చాలా విషయాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించినప్పుడే వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. అన్ని సవ్యంగా ఉంటేనే అధికారులు చక్కటి నిర్ణయాలు తీసుకుంటారన్నారు. చివరిగా తన తల్లికి రాసిన లేఖను పుస్తకంలో అచ్చువేసి ఆ అక్షర అనుభూతిని స్వయంగా ఆయన చదివి వినిపించారు. కౌటిల్యా విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇండిపెండెంట్, మల్టీమీడియా జర్నలిస్టు స్మితాశర్మ డాక్టర్ సుబ్బారావుతో ముఖాముఖి నిర్వహించారు. కౌటిల్యా విద్యార్థులు ప్రశ్నలు అడిగి సుబ్బారావు నుంచి సమాధానాలు రాబట్టారు. డాక్టర్ సుబ్బారావు ఇచ్చిన అనుభవపూర్వకమైన సమాధానాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసి డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సంగారెడ్డిలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం తథ్యం

- వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- జహీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ నామినేషన్

సంగారెడ్డి, ఏప్రిల్ 24: మెదక్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైందని, రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. బుధవారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పార్లమెంట్ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్ షెట్కార్ నామినేషన్ వేయగా మంత్రితో పాటు జుక్కల్, నారాయణఖేడ్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రి షబ్బీర్ అలీ హాజరయ్యారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని, ఇచ్చిన హామీలు అమలు చేసే సత్తా కాంగ్రెస్‌కే ఉందని నమ్ముతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదు ఇప్పటికే అమలు చేసి చూపించామని, త్వరలో మరో గ్యారెంటీని అమలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీ లతో పాటు హామీలను పక్కాగా అమలు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌ను ప్రజలు నమ్ముతున్నారని, అత్యధిక స్థానాలను కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు సంజీవ రెడ్డి, లక్ష్మీకాంత్‌రావు, మదన్‌మోహన్‌రావు, మాజీ మంత్రి షబ్బీర్‌అలీ ఉన్నారు.